భూసార పరీక్ష.. రైతన్నకు రక్ష

- భూమిలో పోషకాల స్థాయి తెలుసుకునే అవకాశం
- సరైన ఎరువులు వాడకపోవడంతో ఏటా పంట నష్టాలు
- పరీక్షలు ఎంతో మేలంటున్న వ్యవసాయాధికారులు

మహేశ్వరం: పంటల్లో అధిక దిగుబడులు సాధించాలంటే నేల స్వభావాన్ని బట్టి పంటలు సాగు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకే ముందుగా ప్రతీ రైతు భూసార పరీక్షలు చేయించాలి. ఈ పరీక్షలు గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. భూమిలోని పోషక విలువలు తగ్గితే ఆ మేరకు రసాయన ఎరువులు వాడుతుంటారు. ఇలా విరివిగా రసాయన ఎరువులు వాడుతుండడంతో క్రమేణ భూసారం తగ్గుతోంది. అంతే కాకుండా తెగుళ్ల బెడద కూడా పెరిగి పంటలకు తీవ్రనష్టం కలుగుతోంది. రైతులకు భూసార పరీక్షలపై వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడూ అవగాహన కల్పిస్తే పంటల సాగుపై ఒక స్పష్టత వచ్చే ఆవకాశం ఉంటుంది. ఏ భూముల్లో ఏ రకమైన పంటల సాగుకు అనుకూలంగా ఉంటాయి. భూమిలో పోషకాల స్థాయి, వాటిలో ఏ ఎరువులు వేయాలని అనే విషయాలపై రైతులకు అవగాహన కలగాలంటే భూసార పరీక్షలు తప్పని సరిగా చేయించాలి. సరైన సమయంలో వర్షాలు పడకపోవడం , తెగుళ్ల బెడదతో రైతులు ఏటా పంటలు నష్టపోతున్నారు. ఈ క్రమంలో భూసార పరీక్షలు నిర్వహించి వాతావరణ పరిస్థితులకు తగిన పంటలను సాగు చేస్తే ఆశించిన దిగుబడులు సాధించొచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

అవగాహన లేమితో పంట నష్టాలు..

రైతులు పంటల సాగుపై దృష్టి పెడుతున్నారు. కానీ భూమిలోని పోషకాల స్థాయి తెలుసుకోవడంలో విఫలమవుతున్నారు. విరివిగా రసాయన ఎరువుల వాడకంతో సాగు వ్యయం పెరగడంతో పాటు భూమిలో పోషక విలువలు తగ్గుతున్నాయి. నేల స్వభావం తెలియక అవసరానికి మించి క్రిమిసంహారక మందులు వినియోగిస్తున్నారు. అయినా పంట నష్టాలు చవిచూస్తున్నారు. భూసార పరీక్షల ప్రాధాన్యంపై రైతు సదస్సులు, సమావేశాల్లో వ్యవసాయ అధికారులు పదేపదే చెబుతున్నారు. రైతులు ఆ దిశగా ఆడుగులు వేయడం లేదు. అదే విధంగా భూసార పరీక్షల ఫలితాలను అధికారులు సమయానికి అందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



మహేశ్వరంలో ఓ రైతు పొలంలో మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

ఫలితాల ఆధారంగా సాగు..

భూసార పరీక్షలు చేయించుకొని వాటి ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మొక్కల పెరుగుదలకు 16 రకాల పోషకాలు అవసరమని, భూసార పరీక్షల ద్వారా భూమిలో లవణ సూచిక పోషకాలు, నత్రజని, భాస్వరం, పొటాష్‌ల లభ్యతను తెలుసుకునే ఆవకాశం ఉంటుంది. దీంతో అవసరమైన మోతాదులో ఎరువుల వినియోగానికి ఆవకాశం ఉంటుంది. కొందరు రైతులు ఒకే పంటను తరుచూ సాగు చేస్తుండడంతో పాటు అధిక రసాయన ఎరువులు వినియోగిస్తుండటంతో భూమిసారం కోల్పోయి పంట దిగుబడులు తగ్గుతాయని పేర్కొంటున్నారు.

రైతులకు ఎంతో మేలు



భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయి. రైతులు ఏటా భూసార పరీక్షలు చేయించుకోవాలి. ఈ పరీక్షలతో భూమి సారం ఎంతో తెలుస్తుంది. ఆ మేరకు భూమికి కావాల్సిన పోషకాలను ఇవ్వగలిగే ఎరువులు వాడుకునే ఆవకాశం ఉంటుంది. పంటల సాగులో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలి.

– నాగమణి, ఏఓ, మహేశ్వరం

క్లుప్తంగా

కార్యకర్తల కుటుంబీకులకు పరామర్శ



కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: మండల పరిధిలోని లేమూరుకు చెందిన బీఆర్‌ఎస్ సానుభూతిపరులు ఎలుక శ్రీధర్‌రెడ్డి, పోలోజి లక్ష్మయ్య అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి వారి భౌతికకాయాలకు నివాళులర్పించి కుటుంబీకులను ఓదార్చారు. పార్టీ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పరంజ్యోతి, గణేష్, మాజీ ఉప సర్పంచ్ కొండల్‌రెడ్డి, నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, సంజీవరెడ్డి, జైపాల్, మల్లేశ్ పాల్గొన్నారు.

యోగా శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

వనస్థలిపురం: ఆరోగ్య పరిరక్షణకు యోగా అవసరమని, యోగా శిక్షణా కేంద్రాలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. భారతీయ యోగా సంస్థాన్ ఆధ్వర్యంలో వనస్థలిపురంలోని ఆచార్య జయశంకర్ పార్కులో ఏర్పాటు చేసిన నిరంతర ఉచిత యోగా శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీవాసులు సుధాకర్‌రెడ్డి, కిరణ్, గణేశ్, సంస్థాన్ జిల్లా అధ్యక్షుడు పి.వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఆర్.యాదగిరి, యోగా శిక్షకులు పాల్గొన్నారు.

ముగిసిన బాల వికాస్ సమ్మర్ క్యాంప్



బాలవికాస్ సమ్మర్ క్యాంప్‌లో దేశ భక్తి గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు

చైతన్యపురి: గడ్డిఅన్నారం శారదానగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో కుటుంబ ప్రబోధ్ విభాగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలవికాస్ సమ్మర్ క్యాంప్ సోమవారం ముగిసింది. అంతరించిపోతున్న సంస్కృతి, సంప్రదాయాలు, దేశభక్తితో పాటు మాతృభాష ఆవశ్యకతను పిల్లల్లో అవగాహన పెంచేందుకు 20 రోజుల పాటు క్యాంపు నిర్వహించామని నిర్వాహకులు వినోద్‌కుమార్, లక్ష్మీనారాయణ తెలిపారు. పిల్లలకు దేశభక్తి, దైవ భక్తి, భగవద్గీత శ్లోకాలు, నీతి కథలు, పాటలు నేర్పించామని తెలిపారు. 70 మంది చిన్నారులు పాల్గొన్నారని పేర్కొన్నారు.శ్రీనివాసరావు, రాజేందర్ ప్రసాద్, అరుణ జ్యోతి పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఎస్ఐ

ఇబ్రహీంపట్నం: లోక్‌సభ ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నేటి నుంచి 48 గంటల పాటు ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, సభలు పెట్టొద్దని ఇబ్రహీంపట్నం ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. లౌడ్ స్పీకర్లు పెట్టడం, బాణసంచాలు లాంటివి కాల్చడం చేయొద్దన్నారు. కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆమనగల్లులో పారిశుద్ధ్య పనులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో సోమవారం మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వివిధ కాలనీల్లో మురుగు కాలువలు నిండిపోయాయి. దీంతో మున్సిపల్ కమిషనర్ వసంత ఆధ్వర్యంలో సిబ్బంది మురుగు కాలువలను శుభ్రం చేశారు. స్థానిక పట్టణంలోని సురసముద్రం చెరువు బతుకమ్మ ఘాట్ వద్ద మట్టి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారడంతో మరమ్మతు చర్యలు చేపట్టారు. బతుకమ్మ ఘాట్‌ను మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కమిషనర్ వసంత, కౌన్సిలర్ విజయ్‌కృష్ణ, నర్సింహులు తదితరులు పరిశీలించారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్‌ల్లో కూరగాయల ధరలు (కిలో.. రూపాయల్లో) టమాట 31, వంకాయ 23, బెండ 38, పచ్చి మిర్చి 50, కాకర 38, బీర 35, క్యాబేజీ 21, ఫ్రెంచి బీన్స్ 125, క్యారెట్ 40, దొండ 13–18, చిక్కుడు 75, గోకర 40, బీట్‌రూట్ 21, క్యాప్సికం 55, ఆలు 31, దోస 23, సొర 11, పొట్ల 18, ఉల్లిగడ్డ 27, చామగడ్డ 40.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

సీఐ సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం రూరల్: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ కోరారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని సాహెబ్‌గూడ గ్రామస్తులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. సీఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు సహకారం అందించాలని కోరారు. వ్యాపార సముదాయాలు, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మారయ్య, మండల ప్రజాపరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌ఖాన్, నాయకులు జంగయ్య, నర్సింహ, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

యాచారం: మొండిగౌరెల్లిలో పునఃనిర్మాణం చేపడుతున్న స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ నిర్మాణం కోసం డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య సోమవారం రూ.రెండు లక్షల 51 వేల విరాళాన్ని అందజేశారు. ఆలయ నిర్మాణానికి రూ.5,11,113 విరాళం అందజేస్తానని గతంలో సత్తయ్య హామీ ఇచ్చారు. మొదట్లో రూ.రెండున్నర లక్షలు అందజేయగా, సోమవారం మిగితా మొత్తాన్ని విరాళంగా ఆలయ కమిటీ సభ్యుడు శ్రీనివాస్‌గుప్తకు అందజేశారు. కాగా మొండిగౌరెల్లి గ్రామస్తులు రూ.2 కోట్లకు పైగా నిధులతో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునఃనిర్మాణ పనులు చేపడుతున్నారు.

బోనమెత్తి.. అమ్మకు సమర్పించి

కందుకూరు: మండల పరిధిలోని రాచులూరులో పెద్దమ్మతల్లి బోనాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఐదేళ్లకు ఒకసారి అమ్మవారికి ప్రత్యేక పూజలతో బోనాలు సమర్పించే ఆనవాయితీ ఉంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాల నడుమ మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మ వారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ముదిరాజ్ కులపెద్దలు తిక్కల కృష్ణముదిరాజ్, సుద్దుల నర్సింహాముదిరాజ్, లక్ష్మయ్య, అంజయ్య, నర్సింహ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

సమస్యల పరిష్కారానికి కృషి



కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

ఎల్‌బీనగర్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీలో మంగళవారం ఆయన పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ స్తంభాల సమస్య తీవ్రంగా ఉందని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. తరుచూ కరెంట్ సరఫరాలో అంతరాయం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేసేలా చూడాలని ఈ సందర్భంగా కాలనీవాసులు ఆయనను కోరారు. దీంతో స్పందిస్తూ విద్యుత్ అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీనిచ్చారు. అనంతరం పలు సమస్యలపై కాలనీవాసులు కార్పొరేటర్ లచ్చిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటాచలం, విక్రం, భ్రమరాంబ, నాయకులు ముత్యాలు, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అన్నిరంగాల్లో అభివృద్ధి



వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: గత దశాబ్ది కాలంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించిందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ముగింపు వేడుకల్లో భాగంగా వనస్థలిపురం ఏరియాసుపత్రిలో సోమవారం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ట్రాఫిక్ సమస్యలు ఉన్న చోట స్కై, ఫ్లై ఓవర్లు నిర్మించామని, నాగోల్‌లో ఎస్‌టీపీ ప్లాంట్ పనులు జరుగుతున్నాయని, అలాగే పలు ప్రాంతాల్లో ఎస్ఆర్‌డీపీ పనులు చేపట్టామని పలు పనులు చివరి దశలో ఉన్నాయని పేర్కొన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మూడు మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ కృష్ణ, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, నాయకులు గజ్జల మధుసూదన్‌రెడ్డి, సుమన్ గౌడ్, మాధవరం నర్సింహరావు, మధుగౌడ్, సామ బుచ్చిరెడ్డి, శివశంకర్, సత్యంచారి, ఖైసర్, సంజయ్‌కుమార్, రాంమోహన్, అజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

మంచాల: యువతపైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని సినీ దర్శకుడు బాబ్జి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చిత్తాపూర్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రమ శిక్షణతో చదువుతో పాటు క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం డీవైఎఫ్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కె.భాస్కర్ మాట్లాడుతూ.. యువత దేశభక్తి కలిగి ఉండటంతో పాటు ప్రజలను చైతన్యం చేయడం, ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తే తిరుగుబాటు చేయాలని కోరారు. కాగా క్రికెట్ పోటీల్లో మొదటి బహుమతి శ్రీకాంత్ టీం, ద్వితీయ బహుమతి కిరణ్ టీం గెలుచుకుంది. గొర్ల కాపర్ల సంఘం జిల్లా నాయకుడు రావుల జంగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహ, చంద్రయ్య, యాదయ్య, భాషయ్య, రాంరెడ్డి, నాగరాజు, పాండు, కృష్ణ, శర్మ, రవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్: అనాథలకు అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



మీర్‌పేట: నందిహిల్స్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న కో ఆప్షన్ సభ్యుడు రజాక్

ఉద్యమకారులకు అండగా బీఆర్‌ఎస్

మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి మీర్‌పేట చందన చెరువు వద్ద రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయశంకర్ చిత్రపటానికి నివాళులు అర్పించి మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో ఏళ్లు ఉద్యమం చేసి కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని, తరువాత పదేళ్లు ముఖ్యమంత్రిగా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లారని గుర్తుచేశారు. అమరుల త్యాగాలను కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లప్పుడూ గుర్తు చేసుకుంటూ వారి కుటుంబాలకు అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ గ్రంథాలయ చైర్మన్ శ్రీధర్, మాజీ గిడ్డంగుల చైర్మన్ రజినీసాయిచంద్, మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, నాయకులు కామేష్‌రెడ్డి, భూపేష్‌గౌడ్, శ్రీనునాయక్, లావణ్య, యాదగిరి ముదిరాజ్, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

నందిహిల్స్‌లో జెండావిష్కరణ

రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల ముగింపులో భాగంగా సోమవారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధి నందిహిల్స్ చౌరస్తాలో కో ఆప్షన్ సభ్యుడు రజాక్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ అధిష్టానం, ఎమ్మెల్యే సబితారెడ్డి ఆదేశాల మేరకు మూడు రోజుల పాటు కార్పొరేషన్‌లో వేడుకలను నిర్వహించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జగాశ్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, సునీత, నర్సిరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామాచారి తదితరులు పాల్గొన్నారు.



తుక్కుగూడ: ఇమామ్‌గూడలో బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరణలో నాయకులు

తుక్కుగూడలో..

తుక్కుగూడ: రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాల్లో నాయకులు ఆ పార్టీ జెండాను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు అండగా ఉంటాం

బడంగ్‌పేట్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ మాతృదేవోభవ అనాథ, మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనాథలకు తన చేతుల మీదుగా అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనాథలు, మానసిక దివ్యాంగులకు అండగా ఉండటం మానవ కనీస ధర్మమన్నారు. శాశ్వత షెడ్డు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, కార్పొరేటర్ భీమిడి స్వప్నజంగారెడ్డి, అభాకాస్ చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ అంకంగారి మంజుల కుమార్‌గౌడ్, జంగయ్య, మాజీ కౌన్సిలర్ యాదయ్య, నరేందర్‌రెడ్డి, భాగ్యనగర్ బ్యాంక్ చైర్మన్ నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పహాడీషరీఫ్: సయ్యద్ ఫెరోజ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ఉద్యమకారుడికి గుర్తింపు

పహాడీషరీఫ్: తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి నాయకుడిగా పోరాడిన జల్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన సయ్యద్ ఫెరోజ్‌ను మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఘనంగా సన్మానించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బీఆర్‌ఎస్ పార్టీ తరఫున ఫెరోజ్ ఉద్యమ స్ఫూర్తిని గుర్తించి అభినందనలు తెలియజేసి జ్ఞాపికను అందజేశారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో ఉద్యమంలో బీటెక్ విద్యార్థి గా 2009 నుంచి ఫెరోజ్ ఎంతో చురుకైన పాత్ర పోషించారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బర్కత్ అలీ, కాసీం తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పౌరాణిక పద్యనాటకం



శ్రీకృష్ణ రాయభారం పద్యనాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని ఇన్‌కంట్యాక్స్ కాలనీలో శ్రీకృష్ణరాయభారం పౌరాణిక పద్యనాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా నటీనటులు తమ హావాభావాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఇందులో దుర్యోధనుడిగా కొట్టె వెంకటాచార్యులు, శ్రీకృష్ణుడిగా సూలపాణి, గాంధారిగా సావిత్రీతో పాటు దర్శకుడు రాజనాల, ఇతర నటులు అద్భుత నటనను ప్రదర్శించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడి పాత్రధారి సూలపాణి మాట్లాడుతూ తాను సర్జన్ డాక్టర్ అయివుండి నాటక కళారంగం అంతరించిపోకుండ ఉండాలనే ఉద్దేశంతోనే తెలుగు రాష్ట్రాల్లో పౌరాణిక పద్య నాటకాన్ని ప్రదర్శిస్తున్నామని తెలిపారు. రాజశ్రీ రామారావు, వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ, విజయలక్ష్మి, రాధా, మునిపల్లె శ్రీనివాస్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించండి

ఎంపీపీ కృపేశ్

- వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

ఇబ్రహీంపట్నం: వచ్చేది వర్షాకాలం...పారిశుద్ధ్యం మెరుగుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీపీ కృపేశ్, ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కృపేశ్ అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులతో పాటు నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు 15వ ఫైనాన్స్ నిధులను ఎందుకు ఉపయోగించడంలేదని ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్ పంచాయతీ కార్యదర్శులను ప్రశ్నించారు. రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుందని.. వెంటనే 15వ ఫైనాన్స్ నిధులను ఉపయోగించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. పంచాయతీలకు నిధుల కొరత ఉందని, సిబ్బంది జీతభత్యాలకే ఇబ్బందిగా ఉన్నట్లు పంచాయతీ కార్యదర్శులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. 60శాతం 15వ ఫైనాన్స్ నిధులను పారిశుద్ధ్యం మెరుగుకు, నీటి ఎద్దడి నివారణకు ఖర్చుపెట్టుకోవచ్చని క్రాంతికిరణ్ తెలిపారు. కోవిడ్ కంటే ముందు గ్రామాలకు నడిచినట్లుగానే ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని ఎంపీపీ కృపేశ్ కోరారు. పొల్కంపల్లి మీదుగా అనాజ్‌పూర్‌కు నడిపే బస్సును తిరిగి వేయాలని ఎంపీటీసీ మంగ కోరారు. జూన్ 12 నుంచి అన్ని గ్రామాలకు గతంలో మాదిరిగానే బస్సులను నడిపిస్తామని.. అందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు ఆర్టీసీ డిప్యూటీ సూపరింటిండెంట్ వెంకట్‌నాయక్ తెలిపారు.

డ్రగ్స్‌ను అరికట్టాలి..

డ్రగ్స్, గంజాయి బారిన పడి యువత చెడు మార్గంలో పయనిస్తోందని... దీని నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కృపేశ్ కోరారు. డ్రగ్స్ విక్రయించే, కొనుగోలు చేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని, ఎక్కడైన ఇలాంటి విక్రయాలు జరిగినట్లు తెలిస్తే తమకు సమాచారాన్ని ఇవ్వాలని ఎక్సైజ్ సీఐ సీతారాంరెడ్డి కోరారు. హరితహారం కింద ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 3,500 మొక్కలను నాటాలని నిర్ణయించినట్లు ఏపీఓ తిరుపతాచారి తెలిపారు. ఇందుకు అనుగుణంగా పంచాయతీలో మొక్కలను పెంచినట్లు చెప్పారు. పోచారం, మెటిల్లా సమీపంలోని ఓ ప్రైవేట్ వెంచర్‌కు లాభం చేకూరేవిధంగా రోడ్డు వేయడం పట్ల ఎంపీపీ కృపేశ్ ఆర్‌అండ్‌బీ అధికారులపై మండిపడ్డారు. ఉపాధి హామీ పథకం కింద ఐదు ఏకరాల లోపు భూమి ఉన్న రైతులు జామ, మామిడి తోటలను పెంచేందుకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలు మెయిన్ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ అయ్యాయని సీడీపీఓ శాంతిశ్రీ తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, పీఆర్ డిప్యూటీ ఈఈ శ్రీనివాస్‌చారి ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.